# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 325 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 3 మార్చి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


### బీజేపీ జాతీయాధ్యక్ష పదవి..

# వరించేది ఎవరిని?

## షార్ట్ లిస్ట్‌లో ఉన్నదెవరు?

### పేరు ప్రతిపాదించండి... రాష్ట్రాలకు ఆదేశం



**న్యూఢిల్లీ, మార్చి 2 (ప్రభాత ఉదయం):** భారతీయ జనతా పార్టీ కొత్త జాతీయాధ్యక్షుడి ప్రకటన మరో వారం, పది రోజుల్లో రానుంది. పార్టీ నియమావళి ప్రకారం జాతీయాధ్యక్షుడి ఎన్నిక జరగాలంటే దేశంలోని కనీసం సగం రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాలి. అయితే రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు జాప్యం కావడం, వివిధ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో బీజేపీ జాతీయాధ్యక్షుడి ఎన్నిక ఆలస్యమవుతూ వచ్చింది. ఇప్పటి వరకు దేశంలోని 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అంతర్గత ఎన్నికలు పూర్తయ్యాయి. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల యూనిట్లు కలుపుకుంటే మొత్తం 36. ఇందులో సగం పూర్తి కావాలంటే.. మరో 6 రాష్ట్రాల్లో పార్టీ రాష్ట్ర అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. అప్పుడే జాతీయాధ్యక్షుడి ఎన్నిక చేపట్టేందుకు మార్గం సుగమమవుతుంది. ఈ మేరకు ఆ 6 రాష్ట్రాల్లో అధ్యక్ష ఎన్నికల కసరత్తు తీవ్రతరమైంది. తదుపరి అసెంబ్లీ ఎన్నికలు జరుపుకోనున్న రాష్ట్రాలైన తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, గుజరాత్ సహా రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఈ జాబితాలో ఉన్నట్టు తెలిసింది. వీటిలో బిహార్‌లో ఈ ఏడాది చివర్లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, అధ్యక్ష మార్పు ఉండకపోవచ్చని, ప్రస్తుత అధ్యక్షుడికే కొనసాగింపు ఇవ్వవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు జాతీయాధ్యక్షుడిగా ఎవరిని ఎంపిక చేస్తారన్న విషయంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఎవరూ ఊహించని నేతలను తెరపైకి తెస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్న బీజేపీ అగ్ర నాయకత్వం ఈసారి జాతీయాధ్యక్షుడి విషయంలోనూ అలాగే వ్యవహరించవచ్చని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. మార్చి 15

..మిగతా 2లో



### పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయితే

# ఓర్వ లేకపోతున్నారు

### సీఎం రేవంత్ రెడ్డి

**వనపర్తి, మార్చి 2 (ప్రభాత ఉదయం):** పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయితే కొంతమంది ఓర్వలేకపోతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి బహిరంగ సభలో పాల్గొన్న సీఎం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో పాటు, ప్రతిపక్షాలపై కూడా విమర్శలు చేశారు. తాను రాజకీయాల్లో రాణించడంలో వనపర్తి పాత్ర ఎంతో ఉందని, వనపర్తి తనకు చదువుతో పాటు సంస్కారాన్ని ఇచ్చిందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "వనపర్తి ప్రాంతంలో ఎన్నటికి తెగిపోని బంధం నాది. వనపర్తి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టే విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా. తెలంగాణ రాష్ట్రంలో వనపర్తికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఐదేళ్ల క్రితం వనపర్తి లో గెలిచిన ఎమ్మెల్యే రాజకీయాలను కలుషితం చేశారు. వనపర్తి లో అనేక విద్యాసంస్థలకు కాంగ్రెస్ ప్రభుత్వాలే పునాది వేశాయి. వనపర్తిలో నేను నేర్చుకున్న రాజకీయ చైతన్యం తోనే తెలంగాణ ముఖ్యమంత్రి గా మీ ముందు నిలబడ్డ" అని రేవంత్ వెల్లడించారు. 22 వేల కోట్ల రుణమాఫీ.. 25 లక్షల 50 వేల రైతులకు 22 వేల కోట్ల రుణమాఫీ జరిగిందా లేదా గుండెలపై చేయి వేసుకొని చెప్పాలని సీఎం రేవంత్ ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటై ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని విమర్శించారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే 7625 కోట్ల రూపాయల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో వేశామని,

..మిగతా 2లో

### మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌కు

# మాయావతి షాక్

### అన్ని పార్టీ పదవుల నుంచి తొలగింపు



**లక్నో, మార్చి 2 (ప్రభాత ఉదయం):** ఉత్తరప్రదేశ్‌కు చెందిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి ఆదివారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆమె రాజకీయ వారసుడిగా భావిస్తున్న మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌ను మరోసారి అన్ని పార్టీ పదవుల నుంచి

..మిగతా 2లో

### కేసీఆర్ అంటే కాళేశ్వరం..

# కాంగ్రెస్ అంటే శనీశ్వరం: కేటీఆర్



**రాజన్న సిరిసిల్ల :** కేసీఆర్ అంటే కాళేశ్వరం.. కాంగ్రెస్ అంటే శనీశ్వరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. సిరిసిల్ల పర్యటనలో భాగంగా కేటీఆర్ దేవునిగుట్ట తండాలో రైతులను కలిశారు. ఈ సందర్భంగా సాగునీరు లేక తాము పడుతున్న

..మిగతా 2లో

### నాలుగు నిమిషాల్లోనే ఏటీఎంను

# కొల్లగొట్టారు

### మహేశ్వరంలో ఘటన



**హైదరాబాద్, మార్చి 2 (ప్రభాత ఉదయం):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో దొంగలు రెచ్చిపోయారు. మండలంలోని రావిర్యాలలో ఎస్‌బీఐ ఏటీఎంను పగలగొట్టిన దుండగులు భారీగా నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున కారులో వచ్చిన దుండగులు.. ఏటీఎంలోని సీసీ కెమెరాలు, సైరన్ ధ్వంసం చేశారు. గ్యాస్ కట్టర్, ఇనుప

..మిగతా 2లో



## సన్ ఫ్లవర్ రైతుల కష్టాలు

# మీకు పట్టవా!

### సీఎం రేవంత్ రెడ్డికి

### హరీశ్‌రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్, మార్చి 2 (ప్రభాత ఉదయం):** సన్ ఫ్లవర్ రైతుల కష్టాలు మీకు పట్టవా..? అని ప్రశ్నిస్తూ సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ఇంకెప్పుడు ప్రారంభిస్తారు అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయంలో నూనె పంటలకు ప్రోత్సాహం కల్పిస్తే కాంగ్రెస్

..మిగతా 2లో

# ఈ పాపం కేసీఆర్ చేసినదే!

### ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 2 (ప్రభాత ఉదయం):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనపర్తి జిల్లా పర్యటనను ముగించుకొని నాగర్ కర్నూలు జిల్లాకు వచ్చారు. అమ్రాబాద్ మండలంలోని దోమలపెంట సమీపంలో ఎస్ ఎల్ బి సి టన్నెల్ వద్దకు ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. ఫిబ్రవరి 22 నుంచి 8 మంది లోపల చిక్కుకున్న ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపలకు వెళ్లి మరీ పరిశీలించారు. రెస్క్యూ టీమ్ సిబ్బంది, అధికారులతో మాట్లాడి టన్నెల్ వద్ద కొనసాగుతున్న సహాయక చర్యల తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగింది, ప్రమాద తీవ్రత వివరాలు అధికారులను అడిగారు. సహాయక చర్యలు జాప్యం కావడానికి తలెత్తిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టన్నెల్ లోపల చిక్కుకున్న 8 మందిని బయటకు తీయడానికి ఎంత టైం పడుతుందని వారిని ఆరా

..మిగతా 2లో



### ఎదురెదురుగా ఢీకొన్న

# రెండు బస్సులు

### 37 మంది దుర్మరణం

**న్యూఢిల్లీ, మార్చి 2 (ప్రభాత ఉదయం):** బొలీవియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు బస్సులు ఢీకొనడం వల్ల 37 మంది ప్రయాణికులు మృతిచెందారు. ఈ ప్రమాదంలో మరో 39 మంది గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు.. బస్సుల్లో చిక్కుకున్న వారిని అతికష్టం మీద బయటకు తీసుకొచ్చారు. వెంటనే

..మిగతా 2లో



# ఎదురెదురుగా ఢీకొన్న రెండు బస్సులు

మొదటి పేజీ తరువాయి...

చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రపంచ ప్రఖ్యాత ఉప్పు నేలల ప్రాంతమైన సలార్ డి ఉయూనికి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఉరూరో ప్రాంతంలో జరుగుతున్న కార్నివాల్ వేడుకల్లో పాల్గొనేం దుకు పలువురు ఓ బస్సులో వెళ్తుండగా, ఎదురుగా ప్రయాణికులతో వచ్చిన మరో బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్లు కూడా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

# కేసీఆర్ అంటే కాళేశ్వరం.. కాంగ్రెస్ అంటే శనీశ్వరం

మొదటి పేజీ తరువాయి...

ఇబ్బందులను కేటీఆర్‌కు రైతులు వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ కాళేశ్వరం నుంచి నీళ్లు తీసుకువచ్చి మల్కపేట రిజర్వాయర్‌లో పోస్తే దేవునిగుట్ట తండాలోని రైతులు వ్యవసాయం చేసేవారు. కేసీఆర్ మీద ఉన్న కోపం, ద్వేషంతో మేడిగడ్డలో జరిగిన కుట్రపూరిత ప్రమాదాన్ని సాకుగా చూపించడంతో రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోతున్నాయి. సిరిసిల్ల ప్రాంతంలోని చాలామంది రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. కాళేశ్వరం నీళ్లు రాక తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లోనూ వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడిందని కేటీఆర్ పేర్కొన్నారు.

ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు. మేడిగడ్డ పర్రెను రిపేర్ చేసి నీళ్లు ఇవ్వవచ్చు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాకు మండు వేసవిలో ఎర్రటి ఎండల్లో కూడా సిరిసిల్ల జిల్లాలోని అప్పర్ మానేరు ముత్తడి దుంకింది. మిడ్ మానేరు, అప్పర్ మానేరు నింపడంతో ఎర్రటి ఎండల్లో కూడా వాగులు చెరువులను నింపి రైతులను కాపాడుకున్నం. సిరిసిల్ల జిల్లాలో వందల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. చూస్తూ ఊరుకోం. 48 గంటల్లో నీళ్లను వదిలి పెట్టకపోతే మంత్రి ఛాంబర్ ముందట ధర్నా చేస్తాం. ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని కేటీఆర్ హెచ్చరించారు.

కేసీఆర్ మీద కోపం ఉంటే రాజకీయంగా తలపడాలి కానీ రైతులను గోస పెట్టొద్దు. ఇప్పటికే 450 మంది రైతులను రేవంత్ రెడ్డి పొట్టన పెట్టుకున్నాడు. కాంగ్రెస్ చెప్పిన రైతు డిక్లరేషన్‌లో ఒక్క మాటను కూడా నిలబెట్టుకోలేదు. రైతుబంధును కూడా వేయడం లేదు. ఈ ప్రభుత్వానికి కరెంటు ఇచ్చే తెలివి లేదు నీళ్లు ఇచ్చే తెలివి లేదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక నీళ్లేమో పాతాళంలోకి పోయాయి.. నిధులేమో ఢిల్లీకి పోతున్నాయి.. నియామకాలు ఏమో గాల్లో కలిసిపోయాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని రైతులను కాపాడుకోవడానికి వెంటనే నీళ్లను విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ప్రస్తుతం మిడ్ మానేరులో 16 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఒక్క టీఎంసీ నీళ్లను మల్కపేట రిజర్వాయర్‌కు వదిలిపెట్టాలని కోరుతున్నాము. తాగునీటి అవసరాలకు మూడు టీఎంసీలు మాత్రమే కావాలి. తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాదు. ఇంకా 13 టీఎంసీల నీళ్లు మిడ్ మానేరులో ఉంటాయి. రైతులకు నీళ్లు విడుదల చేయకపోతే అన్నదాతలతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తాం. రైతులు గుండె ధైర్యంతో ఉండి వ్యవసాయాన్ని కొనసాగించాలని కేటీఆర్ సూచించారు.

# ఈ పాపం కేసీఆర్ చేసినదే!

మొదటి పేజీ తరువాయి...

తీశారు. ఇలా ప్రమాదాలు జరగకుండా ఏం చేయాలో ఉన్నతాధికారులు దీనిపై ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఎస్ ఎల్ బి సి టన్నెల్ పరిశీలించిన సమయంలో ఆయన వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ ఎంపీలు, జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు.

**ఎస్ఎల్‌బీసీ ఘటన పాపం బీఆర్ఎస్ వారిదే..**

ఎస్ఎల్‌బీసీ పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదే, కేసీఆర్ దేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణలో ప్రాజెక్టులు పూర్తి చేసిన కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు.. దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులపై సవతి తల్లి ప్రేమ చూపించారని వనపర్తిలో జరిగిన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ఆరోపించారు. పదేళ్లలో ఎస్ఎల్‌బీసీ మిగతా పనులు పూర్తి చేయని పాపం కేసీఆర్ దే అని, 8 మంది టన్నెల్ లోపల చిక్కుకుపోవడానికి గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం రాయలసీమకు తీసుకుపోతుంటే చూస్తూ కూర్చున్నారని విమర్శించారు.

# మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌కు మాయావతి షాక్

మొదటి పేజీ తరువాయి...

తొలగించారు. ఆకాష్ తండ్రి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్, రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతమ్‌ను కొత్త జాతీయ సమన్వయకర్తలుగా నియమించారు. ఆదివారం లక్నోలో జరిగిన బీఎస్పీ సమావేశంలో ఈ మేరకు పార్టీలో భారీ మార్పులు చేశారు. కాగా, బీఎస్పీ సంస్థాగత బలాన్ని బలహీనపరిచే వర్గాలను సృష్టించడం ద్వారా పార్టీలో విభజనకు అశోక్ సిద్ధార్థ్ కారణమయ్యారని మాయావతి ఆరోపించారు. పార్టీకి లేదా ఉద్యమానికి హాని కలిగించడానికి తన పేరును దుర్వినియోగం చేస్తే వారిని వెంటనే తొలగిస్తానని ఆమె స్పష్టం చేశారు. మరోవైపు ఈ సూత్రానికి అనుగుణంగా అశోక్ సిద్ధార్థ్‌ను పార్టీ నుంచి బహిష్కరించినట్లు మాయావతి తెలిపారు. ఆయన ప్రభావం ఉన్న అల్లుడు ఆకాష్ ఆనంద్‌ను కూడా పార్టీ బాధ్యతలన్నింటి నుంచి తొలగించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని బహుజనుల పురోగతికి మాత్రమే కాకుండా దేశ పురోగతికి ఈ మార్పు అవసరమని అన్నారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతి వేడుకల ప్రణాళికలను కూడా మాయావతి వెల్లడించారు.

# నాలుగు నిమిషాల్లోనే ఏటీఎంను కొల్లగొట్టారు

మొదటి పేజీ తరువాయి...

రాడ్లతో ఏటీఎం మెషిన్‌ను బద్దలు కొట్టారు. డబ్బును తీసుకొని పారిపోయారు. కేవలం నాలుగు నిమిషాల్లోనే పనిపూర్తిచేసి డబ్బు ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలానికి చేరుకున్న మహేశ్వరం డీసీపీ సునితా రెడ్డి, ఏసీపీ రాజు ఏటీఎంను పరిశీలించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దొంగలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. బృందాలు గా ఏర్పడి దొంగల కోసం గాలిస్తున్నారు. కాగా, రెండు రోజుల క్రితం ఏటీఎంలో రూ.30 లక్షలు పెట్టినట్లు బ్యాంక్ మేనేజర్ వెల్లడించారు.

## బీజేపీ జాతీయాధ్యక్ష పదవి..

# వరించేది ఎవరిని?

మొదటి పేజీ తరువాయి...



తర్వాత మంచి రోజులు లేవు కాబట్టి ఈలోగానే కొత్త అధ్యక్షుడి ప్రకటన ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే.. జాతీయాధ్యక్షుడి కోసం పేర్లను ప్రతిపాదించాల్సిందిగా రాష్ట్ర యూనిట్లకు బీజేపీ కేంద్ర నాయకత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత బీజేపీ జాతీయాధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా (జేపీ నడ్డా) పదవీకాలం పూర్తయినప్పటికీ, ఆయనకు తాత్కాలికంగా పదవీకాలాన్ని పొడిగిస్తూ.. కొత్త అధ్యక్షుడి ఎన్నిక జరిగే వరకు అధ్యక్ష బాధ్యతల్లో కొనసాగే వెసులుబాటు కల్పించిన విషయం తెలిసిందే. బీజేపీ జాతీయాధ్యక్షుడిగా జేపీ నడ్డా 2019లోనే పగ్గాలు చేపట్టినప్పటికీ% 2020లో ఆయన ఎన్నికకు అధికారిక ముద్ర పడింది. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆయన పదవీకాలాన్ని 2024 జులై వరకు పొడిగించారు. మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జేపీ నడ్డాను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలను అప్పగించారు. ఆ వెంటనే జాతీయాధ్యక్షుడి ఎన్నిక నిర్వహించి కొత్తవారికి బాధ్యతలు అప్పగించాల్సి ఉన్నప్పటికీ.. హర్యానా, జార్ఖండ్, మహారాష్ట్ర, జమ్ము-కాశ్మీర్, ఢిల్లీ రాష్ట్రాల్లో వరసగా అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో తాత్కాలికంగా వాయిదా వేస్తూ వచ్చారు. ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు కూడా ముగిసిన నేపథ్యంలో.. అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ వేగవంతమైంది.

**పరిశీలనలో వివిధ సమీకరణాలు**

కీలక పదవులను అప్పగించే విషయంలో ఏ రాజకీయ పార్టీ అయినా సామాజిక, ప్రాంతీయ, మత, లింగ సమీకరణాలను పరిశీలిస్తుంది. తద్వారా ఆయా వర్గాలకు ప్రాధాన్యత కల్పించినట్టు సందేశాన్ని పంపిస్తూ.. ఎన్నికల సమయంలో లబ్ది పొందాలని చూస్తుంది. ఇప్పుడు బీజేపీ జాతీయాధ్యక్షుడి ఎన్నిక విషయంలోనూ పార్టీ అగ్రనాయకత్వం వివిధ సమీకరణాలను బేరీజు వేసుకుంటోంది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తర్వాత దక్షిణాది రాష్ట్రాల నుంచి అధ్యక్ష బాధ్యతలను ఎవరూ చేపట్టలేదు. 2002-2004 మధ్యకాలంలో వెంకయ్య నాయుడు బీజేపీ జాతీయాధ్యక్షుడిగా పనిచేయగా, ఆయన కంటే ముందు జానా కృష్ణమూర్తి 2001-2002 మధ్యకాలంలో, బంగారు లక్ష్మణ్ 2000-2001 మధ్యకాలంలో ఈ పదవిని అందుకున్న దక్షిణ భారతీయులుగా రికార్డుల్లో ఉన్నారు. హిందీ మాట్లాడే రాష్ట్రాలతో పాటు మరికొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ విస్తరించి, బలంగా పాతుకుపోయినప్పటికీ.. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక మినహా మరెక్కడా ఆ పార్టీకి అధికారం దక్కలేదు. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం తెలంగాణ నుంచి కూడా ప్రాతినిధ్యం కనిపిస్తున్నప్పటికీ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇంకా తృతీయస్థానంలోనే ఉంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పార్టీ విస్తరణ అనుకున్నట్టుగా ముందుకు సాగడం లేదు. దీంతో దక్షిణాది ప్రజల భావోద్వేగాలను పసిగట్టి, అందుకు తగ్గ వ్యూహాలతో ముందుకెళ్లాలంటే దక్షిణాదికి చెందిన నేతకే అప్పగిస్తే ఫలితం ఉంటుందని అగ్రనాయకత్వం భావిస్తున్నట్టు తెలిసింది.

ఈ క్రమంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి రేసులో ఎవరున్నారన్నది పరిశీలిస్తే.. బీజేపీ సంస్థాగత వ్యవహారాల జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ దక్షిణాదిన కర్ణాటకకు చెందినవారే. ఆయన జాతీయస్థాయిలో అధ్యక్షుడి తర్వాత అత్యంత ప్రాధాన్యత కల్గిన పదవిలో పనిచేస్తున్నారు. దేశవ్యాప్తంగా లోతైన అవగాహన ఉంది. పైపెచ్చు బీజేపీ సైద్ధాంతిక మాతృసంస్థ "రాష్ట్రీయ స్వయం సేవక్" నుంచి వచ్చారు. కాబట్టి ఆయన పేరును పరిశీలించవచ్చని కొన్ని కథనాలు వినిపిస్తున్నాయి. అలాగే బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయాధ్యక్షుడిగా ఉన్న డా. కే. లక్ష్మణ్ (తెలంగాణ), మహిళా మోర్చా జాతీయాధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ (తమిళనాడు)కూడా దక్షిణాదికి చెందినవారే. పైగా బీజేపీ అనుబంధ విభాగాలకు జాతీయాధ్యక్షులుగా పనిచేస్తున్నందున వారికి జాతీయస్థాయి రాజకీయాలపై అవగాహన ఇప్పటికే ఉంది. వీరిలో వనతి శ్రీనివాసన్ మహిళ కావడంతో ఆ సమీకరణాల్లోనూ ఆమెకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. బీజేపీ ఇప్పటి వరకు రాష్ట్రపతి, ముఖ్యమంత్రి, లోక్‌సభ స్పీకర్ సహా మరెన్నో పదవులను మహిళలకు కట్టబెట్టినప్పటికీ, ఆ పార్టీ జాతీయాధ్యక్ష పదవిలో ఇప్పటి వరకు ఒక్క మహిళ కూడా లేదు. చారిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేసిన కమలనాథులు.. అధ్యక్ష పదవిని సైతం మహిళ చేతిలో పెట్టి జనాభాలో సగం ఉన్న మహిళల మనసు గెలుచుకునే ప్రయత్నాలు చేయవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

జాతీయాధ్యక్షుడి రేసులో వీరితో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి (తెలంగాణ), ప్రహ్లాద్ జోషి (కర్ణాటక) పేర్లు కూడా వినిపించాయి. అయితే ఇద్దరూ అనాసక్తి ప్రదర్శించినట్టు తెలిసింది. ఇక ఉత్తరాది రాష్ట్రాల నుంచి భూపేంద్ర యాదవ్, శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్ వంటి నేతల పేర్లు రేసులో వినిపిస్తున్నాయి. అలాగే రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలిచినప్పటికీ.. ముఖ్యమంత్రి పదవికి దూరమైన మాజీ సీఎం వసుంధర రాజే పేరు సైతం అధ్యక్ష పదవి రేసులో వినిపిస్తోంది. పార్టీలో ప్రధాన కార్యదర్శిగా ఉన్న సునీల్ బన్సల్, మహారాష్ట్ర బీజేపీ నేత వినోద్ తావ్డేలు సైతం రేసులో ఉన్నారు.

## పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయితే

# ఓర్వ లేకపోతున్నారు

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 16 వేల మెగావాట్ల కు పైగా పెరిగినా ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా చూస్తున్నామని, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, మహిళలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, యాభై లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్, యాభై లక్షల కుటుంబాలకు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్, బీజేపీ వాళ్ల కు ఆడబిడ్డ లు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అలాగే 50 కోట్ల మంది ఆడబిడ్డలు ఆర్టీసీ లో ఉచిత ప్రయాణం చేశారని, అందుకోసం ఆర్టీసీకి ప్రభుత్వం రూ.4500 కోట్ల చెల్లించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

కేసీఆర్ హయాంలో డ్వాక్రా సంఘాలు నిర్వీర్యం! స్వయం సహాయక సంఘాలను కేసీఆర్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, సున్నా వడ్డీ, పావలా వడ్డీ రుణాలు ఇవ్వలేదని అన్నారు. వనపర్తి సాక్షి గా ఈ రోజు రూ.1000 కోట్ల రుణాలను ఆడబిడ్డలకు ఇచ్చామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 65 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని, అయినా కూడా స్వయం సహాయక సంఘాలను ఆదుకునే బాధ్యత తనదే అని సీఎం రేవంత్ ప్రకటించారు. హైటెక్ సిటీ శిల్పారామం పక్కనే స్వయం సహాయక మహిళల కోసం 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థల పక్కనే మహిళా సంఘాలకు మూడున్నర ఎకరాల స్థలం ఇస్తారని ఎప్పుడైనా ఊహించారా..? అని ప్రశ్నించారు. అదానీ, అంబానీ లే కాదు స్వయం సహాయక మహిళలు కూడా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రోత్సహిస్తున్నామని, 1000 బస్సులను స్వయం సహాయక మహిళలతో కొనుగోలు చేయించి ఆర్టీసీ కి అద్దెకు ఇచ్చేలా చేశామని, ప్రభుత్వ పాఠశాల్లో చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు బట్టలు కుట్టే పనిని స్వయం సహాయక మహిళలకు కల్పించామని సీఎం గుర్తు చేశారు.

మహిళలపై పేరు మీద ఇందిరమ్మ ఇళ్లు.. రాష్ట్రంలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల ను మహిళల పేరుతో ఇస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగులు క్రియాశీలకంగా పనిచేశారని, 10 ఏళ్లలో కేసీఆర్ నిరుద్యోగ యువతకు ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని, కాని ఆయన కుటుంబంలో అందరికీ ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ రాజ్యం లో మొదటి ఏడాదిలోనే 55,163 ఉద్యోగాలు ఇచ్చామని, ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 55 వేల ఉద్యోగాలు ఇవ్వడం దేశ చరిత్రలో ఇదే మొదటి సారి అని ముఖ్యమంత్రి రేవంత్ చెప్పుకొచ్చారు. 22 వేల టీచర్లకు ప్రమోషన్లు, 35 వేల టీచర్లకు బదిలీలు చేసి వారి సమస్యలు పరిష్కరించినట్లు వెల్లడించారు.

పదేళ్ల పాటు ఫామ్ హౌస్ లో పడుకుని.. కేసీఆర్ పదేళ్ల పాటు ఫామ్ హౌస్‌లో పడుకొని ప్రజల గురించి ఆలోచించలేదని సీఎం రేవంత్ విమర్శించారు. పదేళ్లలో ప్రాజెక్టులు కడితే పాలమూరు ప్రజలు ఎందుకు వలస పోతున్నారని, వలసలు పోతున్న పాలమూరు ప్రజల గురించి కేసీఆర్ ఏనాడైనా ఆలోచించారా? పదేళ్లలో పాలమూరు ప్రాజెక్ట్‌ను ఎందుకు పూర్తి చేయలేదు? బీమా, కల్వకుర్తి, నెట్టంపాడు ఎందుకు పూర్తి చేయలేదు..? ఆర్డీఎస్ ఎందుకు ఎండిపోయింది..? అని ప్రశ్నించారు. ఎస్ఎల్బీసీ పదేళ్ల పాటు పడావు పెట్టడంతో కుప్పకూలిపోయిందని, ఈ పాపం కేసీఆర్‌ది కాదా..? అని రేవంత్ ప్రశ్నించారు. ఆంధ్రావాళ్లు రాయలసీమకు నీళ్లు తరలించుకుపోతుంటే గుడ్లప్పగించుకుంటు కేసీఆర్ చూడలేదా? ప్రగతి భవన్ కు జగన్ ను పిలిచి పంచభక్ష పరమాన్నం పెట్టి రాయలసీమ ఎత్తిపోతలకు పునాది రాయి వేసింది కేసీఆర్ కాదా? రోజమ్మ ఇంటికి పోయి రొయ్యల పులుసు తిని రాయలసీమ రతనాల సీమ చేస్తానని కేసీఆర్ అనలేదా? మహబూబ్ నగర్ ప్రజలు నిన్ను గుండెల్లో పెట్టుకొని ఎంపీ గా గెలిపించుకుంటే కేసీఆర్ ఏం చేశావు? అని మాజీ సీఎం కేసీఆర్‌పై విమర్శల వర్షం కురిపించారు సీఎం రేవంత్.

పాలమూరు రుణం తీర్చుకుంటా.. పాలమూరు రుణం తీర్చుకోవడానికి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యానని సీఎం రేవంత్ అన్నారు. పాలమూరును పడాగ పెట్టింది కేసీఆరే.. నమ్మినందుకు నట్టేట ముంచాడని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది కాకముందే మమ్మల్ని దిగిపోమని బీఆర్ఎస్ సన్నాసులు అంటున్నారు. పదేళ్ల పాటు అధికారాన్ని అనుభవించి బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారు. పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయితే ఓర్వ లేకపోతున్నారని విమర్శించారు. పాలమూరు బిడ్డలకు పరిపాలించే శక్తి లేదా? అని ప్రశ్నించారు. పాలమూరు వాళ్లది అమాయకత్వం కాదు మంచితనం.. తిక్క రేగితే డొక్క చీల్చి డోలు కడతం జాగ్రత్త అంటూ హెచ్చరించారు. కేసీఆర్ చెప్పే హరికథలు, పిట్టకథలు నడవు, తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదినది పాలమూరు బిడ్డ జిల్లెల చిన్నారెడ్డి, నానా కష్టాలు పడి వరంగల్ కు ఎయిర్ పోర్టు తీసుకువస్తే కిషన్ రెడ్డి నేనే తీసుకువచ్చానని చెపుతున్నాడు అని సీఎం అన్నారు.

కిషన్ రెడ్డి అభివృద్ధిని అడ్డుకుంటున్నారు! మెట్రో విస్తరణ అనుమతులు, మూసీ నది ప్రక్షాళనకు నిధులు, రీజనల్ రింగ్ రోడ్డు కు అనుమతులు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు నీటి కేటాయింపులు, కాళేశ్వరానికి నీటి కేటాయింపులు రాకుండా కిషన్ రెడ్డి అడ్డుకున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. 12 ఏళ్ల మోదీ పాలనలో 24 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి, మోదీ తెలంగాణలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చాడో కిషన్ రెడ్డి లెక్కపెట్టి చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణలో మోదీ రెండు బోడి ఉద్యోగాలు ఇచ్చాడు, కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు మంత్రి పదవులు ఇచ్చారని ఎద్దేవా చేశారు. సికింద్రాబాద్ లో వరదలు వచ్చి కొట్టుకుపోతే కేంద్రం చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదని సీఎం అన్నారు. కిషన్ రెడ్డి కడుపు నిండా అసూయ, కుళ్ళు పెట్టుకుని కాళ్లలో కట్టెలు పెడుతున్నాడు, హైదరాబాద్ కు కేంద్ర మంత్రి వచ్చి సమీక్ష చేస్తే కిషన్ రెడ్డి ఎందుకు హాజరుకాలేదు? ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి వస్తే గల్లీలో ఉన్న నువ్వు ఎందుకు సమీక్షకు రావు? కిషన్ రెడ్డి దుర్బుద్ధి తెలంగాణ ప్రజలకు తెలుసు అని సీఎం రేవంత్ విమర్శించారు.

అందరం కలిసి కేంద్రాన్ని అడుగుదాం.. రాష్ట్రానికి కావాల్సిన ప్రాజెక్టులు, నిధులపైన అన్ని పార్టీల ఎంపీలతో భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహిస్తారని, అందరం కలిసి కేంద్రం దగ్గరకు వెళ్లి రాష్ట్రానికి కావాల్సిన నిధులు అడుగుదామని సీఎం రేవంత్ కోరారు. నిర్మలా సీతారామన్ తమిళనాడుకు మెట్రో తీసుకువెళ్లారు, కేంద్ర మంత్రి శోభా బెంగళూరు కి మెట్రో తీసుకెళ్లారు, సొంత రాష్ట్రం తెలంగాణ కు కిషన్ రెడ్డి ఎందుకు మెట్రో తీసుకురాడం లేదని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళన చేస్తే కేంద్రం వేల కోట్ల నిధులు ఇస్తోంది, మూసీ ప్రక్షాళన కు ఎందుకు కిషన్ రెడ్డి నిధులు తీసుకురావడం లేదు? కిషన్ రెడ్డి ఎందుకు పాములా బుస కొడుతున్నవు..ఎందుకు పగ పడుతున్నవు? తెలంగాణ కు ఏదో ఒకటి చేయాలని మోదీ సానుభూతి తో ఉన్నాడు.. కిషన్ రెడ్డి పగతో ఉన్నాడు.. సైంధవుడిలా అడ్డుపడుతున్నాడని సీఎం విమర్శించారు. తన మిత్రుడు కేసీఆర్‌కు అధికారం పోయిందని కిషన్ రెడ్డి బాధపడుతున్నాడని అన్నారు.



## సన్ ఫ్లవర్ రైతుల కష్టాలు

# మీకు పట్టవా!

మొదటి పేజీ తరువాయి...

పాలనలో తిరోగమనం చెందుతుందన్నారు. ఎన్నికల కోడ్‌తో ముడిపెట్టకుండా.. తక్షణమే సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను తెరిచేలా ఆదేశాలు ఇవ్వండని సీఎంను హరీశ్‌రావు కోరారు.

**హరీశ్‌రావు లేఖ సారాంశం..**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూనె గింజల ఉత్పత్తిని పెంచడానికి రైతులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడం జరిగింది. సమయానికి రైతుబంధుతో పాటు సబ్సిడీలు అందజేసి నూనె గింజల పంటలను సాగు చేసేలా ప్రోత్సాహం కల్పించాము. సాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నాము. నాటి ప్రణాళికా బద్ధంగా నేడు తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున నూనె పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పొద్దుతిరుగుడు(సన్ ఫ్లవర్) పంట కోతకు వచ్చింది. సన్ ఫ్లవర్ గింజలను విక్రయించడానికి ఇప్పటిదాకా రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉంది. దీనివల్ల రైతులు రూ. 5,500 నుండి రూ. 6000 వరకు దళారులకు క్వింటాల్ చొప్పున విక్రయిస్తున్న పరిస్థితి దాపురించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాఫెడ్ ద్వారా సన్ ఫ్లవర్ నూనె గింజలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేశాము. ఈసారి కూడా రూ. 7280 మద్దతు ధరను నాఫెడ్ ప్రకటించింది. కానీ ఇప్పటిదాకా కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులకు విక్రయించడం వల్ల క్వింటాల్‌కు రూ. 1000 నుండి రూ. 2000 వరకు నష్టాన్ని చవిచూడాల్సిన దుస్థితి రైతులకు కలిగింది. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతుల పక్షాన నేను డిమాండ్ చేస్తున్నాను. మీ అలసత్వం కారణంగా తెలంగాణ వ్యవసాయం తిరోగమన దిశలో పయనిస్తున్నది. నూనె పంటలు వేయాలంటేనే రైతులు ఆందోళన చెందే పరిస్థితులను మీరు కల్పిస్తున్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరవండి.. క్షేత్రస్థాయిలో సన్‌ఫ్లవర్ గింజలు పండించిన రైతుల కష్టాలను తొంగి చూడండి. రేపటి నుండే రాష్ట్రమంతటా సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా ఆదేశించండి. ఎన్నికల కోడ్‌తో రైతుల కష్టాలకు ముడి పెట్టకుండా ఒక ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను అని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు.

# నేడు రాజేంద్రనగర్‌లో నేషనల్ మిల్లెట్ కిసాన్ మేళ-ఇండస్ట్రీ మీట్

బుద్వేల్, మార్చి2(ప్రభాత ఉదయం): 2047 నాటికి వికసిత్ భారత్ గా దేశం రూపుదిద్దుకోవాంటే అన్ని రంగాలు అభివృద్ధి చెందాలనే ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆశయాలకనుగుణంగా ఈ నెల 3వ తేదీన నేషనల్ మిల్లెట్ కిసాన్ మేళ - ఇండస్ట్రీ మీట్ నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి తెలిపారు. ఐఐఎంఆర్ గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ సహకారంతో రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో ఈ జాతీయ చిరుదాన్యాల కిసాన్ మేళ, ఇండస్ట్రీ మీట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మేళాలో చిరుదాన్యాల ఉత్పత్తుల స్టాళ్లు, ఉత్పత్తిదారులు, కొనుగోలు దారుల సమావేశాలు, ప్యానెల్ డిస్కషన్స్ ఉం టాయన్నారు. మేళా లో వివిధ ప్రాంతాలనుంచి రెండు వేల మంది చిరుదాన్యాలు పండించే రైతులు హాజరౌతారన్నారు. మిల్లెట్ ఫార్మర్స్ ప్రొడ్యుసర్ ఆర్గనైజేషన్లు, మహిళ స్వయం సహాయక సంఘాలు. శాస్త్రవేత్తలు, పాలసీ మేకర్స్, వ్యవసాయ రంగ నిపుణులు, చిరుదాన్యాల రంగంలో పనిచేస్తున్న వారు పాల్గొంటారన్నారు. భవిష్యత్ తరాలకు పౌష్టికాహారంతో పాటు అనారోగ్య సమస్తులు లేని జీవితం కావాలంటే


రాజేంద్రనగర్‌లోని ఐఐఎం ఆర్ ప్రధాన కార్యాలయం


డాక్టర్ తారా సత్యవతి

చిరుదాన్యాల అహార ఉత్పత్తుల తోనే సాధ్యమని ఆమె తెలిపారు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఒక్కరు చిరుదాన్యాల వైపు చూస్తున్నారన్నారు. చిరుదాన్యాల ఆహార పదార్థాలు వివిధ రకాల వ్యాధులను నయం చేస్తుందన్నారు. చిరుదాన్యాల ఉత్పత్తుల తో అనేక రకాల ఆహార ఉత్పత్తులను తయారు చేసే ప్రక్రియ మె దలైందన్నారు.

# నేడు కిస్మత్‌పూర్‌లో విద్యుత్తులేని ప్రాంతాలు



బండ్లగూడ, మార్చి 2(ప్రభాత ఉదయం) కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని రాక్ చర్చ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుండి మూడు గంటల వరకు శ్రీ సాయి కాలనీ, ప్రభుత్వ పాఠశాల, రాఘవేంద్ర కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎన్నారై టౌన్షిప్, రాధా రియాలిటీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓం నగర్ కాలనీ, ఎస్ ఎం ఎంక్లేవ్ 1,2, సిఎల్ విల్లాస్, పూజా విల్లాస్, రాక్ చర్చ్, కీర్తి విల్లాస్, మైసమ్మ ప్రధాన రహదారి, కాళికా నగర్, ఎన్ ఎఫ్ సి కాలనీ, మల్లికార్జున నగర్, ఆదర్శనగర్ రోడ్ నెంబర్1,5, న్యూ కేర్ కిస్మత్పూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన కిస్మత్పూర్ గ్రామం, రాఘవేంద్ర కాలనీ, శివ సాయి కాలనీ, బాబమ్మ కాలనీ, వినాయక్ నగర్, మైత్రి కాలనీ, మారుతి కాలనీ, ఎస్సీ బస్తి, శ్రీకృష్ణ కాలనీ, విల్లా గ్రీన్, ఆద్య విల్లాస్, ఓ ఎన్ ఎక్స్ విల్లాస్, గృహ శిల్పి అపార్ట్మెంట్, హనుమాన్ టెంపుల్, బండ్లగూడ విద్యుత్ ఫ్రీడమ్ పరిధిలో సాయంత్రం నాలుగు గంటల నుండి ఐదు గంటల వరకు ఆరే హాస్పిటల్, గాయత్రీ నగర్, వికాస్ నగర్, ద్వారకా నగర్, యాదవ మిత్ర కాలనీ, శిరిడి సాయిబాబా కాలనీ, ప్రశాంత్ కాలనీ, ప్రశాంత్ కమ్యూనిటీ హాల్, భారతి నగర్, డాన్ బెస్కో విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుండి 5 గంటల వరకు మిచల్ కాలనీ, వినాయక నగర్, డిడి కాలనీ, కాళీ మందిర్, ఎన్ ఎఫ్ సి కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయ నగర్, అరుణోదయ నగర్, సంధ్యా నగర్, జి ఆర్ నగర్, మాచన్పల్లి ఎంక్లేవ్ ప్రాంతాలలో వివిధ పనుల నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్తు వినియోగ దారులు ఈ అంతరాయానికి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.



# కివిస్‌పై 44 పరుగులతో టీం ఇండియా గెలుపు

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో టీం ఇండియా, న్యూజిలాండ్ మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 250 పరుగుల విజయలక్ష్యాన్ని చేధించడంలో కివిస్ వెనుక పడింది. కన్ విలియమ్సన్, మిచెల్ శాంత్నర్, విల్ యంగ్ మినహా మిగతా బ్యాటర్లెవరూ క్రీజ్‌లో నిలబడలేక పోయారు. 250 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్దేశిత 50 ఓవర్లలో మరో 27 బంతులు మిగిలి ఉండగానే 205 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో న్యూజిలాండ్‌పై టీం ఇండియా 44 పరుగుల తేడాతో విజయం సాధించి.. సెమీస్‌లో బెర్త్‌ను ఖరారు చేసుకుంది. సెమీస్‌లో ఆస్ట్రేలియాతో టీం ఇండియా తల పడనున్నది.

250 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన కివిస్ ఓపెనర్లు విల్ యంగ్, రుచిన్ రవీంద్రల్లో రవీంద్రను ఆరు పరుగులకే హార్దిక్ పాండ్యా బౌలింగ్లో అక్సర్ పటేల్ క్యాచ్ పట్టి పెవిలియన్ బాట పట్టించాడు. అటుపై 49 పరుగుల వద్ద వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో విల్ యంగ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత వన్ డౌన్ బ్యాటర్‌గా వచ్చిన కేన్ విలియమ్సన్ .. సహచర బ్యాటర్లు ఔటవుతున్నా నిలకడగా ఆడుతూ 81 పరుగులు చేశాడు. కానీ 41వ ఓవర్‌లో అక్షర్ పటేల్ వేసిన చివరి బంతిని కేఎల్ రాహుల్‌కు క్యాచ్ ఇచ్చి కేన్ విలియమ్సన్ ఔట్ కావడంతో కివిస్ ఆట కట్టించారు. డెరిల్ మిచెల్, టామ్ టాథమ్, గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ బ్రేస్ వెల్ ఎల్‌బీడబ్ల్యూ అయ్యారు. భారత్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్లు, కుల్దీప్ యాదవ్ రెండు, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ ఒక్కో వికెట్ తీశారు.

తొలుత బ్యాటింగ్ చేసిన టీం ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 249 పరుగులు చేసింది. టీం ఇండియా సారథి రోహిత్ శర్మ 15, విరాట్ కోహ్లీ 11 పరుగులకే పెవిలియన్ బాట పట్టినా అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్‌లతో కలిసి శ్రేయాస్ అయ్యర్ జట్టు స్కోర్ పెంచేందుకు ప్రయత్నించాడు. శ్రేయాస్ అయ్యర్ 79 పరుగులు, అక్షర్ పటేల్ 42 పరుగులు, హార్దిక్ పాండ్యా 45 పరుగులు చేశారు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ ఐదు, కైల్ జామియాసన్, విల్ ఓ రూర్కే, మిచెల్ శాంత్నర్, రచిన్ రవీంద్ర చెరో వికెట్ తీశారు.

# ఆశాలకు తీపి కబురు

## గ్రాట్యుటీ, ప్రసూతి సెలవులు
## ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు
## ఎన్నికల హామీ మేరకు
## సీఎం చంద్రబాబు నిర్ణయాలు



అమరావతి: ఆశా కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపికబురు అందించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్లే.. ఆశా కార్యకర్తలకూ గ్రాట్యుటీ, వేతనంతో కూడిన ప్రసూతి సెలవుల మంజూరుకు ఆమోదం తెలిపారు. దీంతోపాటు వారి ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచేందుకు ఆరోగ్యశాఖ సమీక్షలో సీఎం అంగీకరించారని ప్రభుత్వం శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఎన్డీయే ఎన్నికల హామీల్లో ఆశాల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం ఒకటి. అందుకు అనుగుణంగా చంద్రబాబు తాజాగా మూడు నిర్ణయాలను ప్రకటించారు. రాష్ట్రంలో 42,752 మంది ఆశా కార్యకర్తలు పనిచేస్తున్నారు. వీరిలో గ్రామీణ ప్రాంతాల్లో 37,017 మంది, పట్టణ ప్రాంతాల్లో 5,735 మంది సేవలందిస్తున్నారు. వీరు ప్రభుత్వ వైద్య పథకాలను ప్రజలకు చేరువ చేయడంతోపాటు తమ ప్రాంతాల్లోని గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరి వేతనాల కోసం ప్రభుత్వం ఏటా రూ.420 కోట్ల వరకు వ్యయం చేస్తోంది.

### గ్రాట్యుటీతో ఆర్థిక భరోసా

ఆశా కార్యకర్తలకు వేతనాల చెల్లింపు తప్ప ప్రభుత్వపరంగా ఇతర ఆర్థిక ప్రయోజనాలేవీ లేవు. ఈ క్రమంలో 30 ఏళ్లపాటు పనిచేసిన ఆశాలకు గ్రాట్యుటీ కింద రూ.1.50 లక్షల వరకు చెల్లించేందుకు సీఎం ఆమోదం తెలిపారు. దీనివల్ల వారికి ఆర్థికభరోసా లభించనుంది. ఆశాలకు గ్రాట్యుటీ విధానం ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేదు. ప్రసూతి సెలవుల కింద తొలి కాన్పు సమయంలో 3 నెలలు, రెండో కాన్పు సమయంలో మరో 3 నెలల చొప్పున అధికారికంగా సెలవులు మంజూరు చేసేందుకు సీఎం అంగీకరించారు. దీంతో సెలవుల కోసం స్థానిక అధికారులను వారు బతిమలాడుకోవాల్సిన పరిస్థితులు తప్పాయి. ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం ఆశాలకు కలిసొచ్చే అంశం.

### 2019కి ముందు కూడా..

2019కి ముందు కూడా ఆశా కార్యకర్తల విషయంలో సీఎం చంద్రబాబు సానుకూల నిర్ణయాలు తీసుకున్నారు. విధుల నిర్వహణలో అవసరమైన వారికి స్మార్ట్‌ఫోన్లు అందజేశారు. అర్హతలు ఉన్న వారికి ఏఎన్ఎం నియామకాల్లో ప్రాధాన్యం ఇచ్చారు. రేషన్ కార్డులు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు కింద ఉచిత వైద్య సదుపాయాలు మంజూరు చేశారు. వృద్ధాప్య పింఛనుకు కూడా అర్హత కల్పించారు. మరే రాష్ట్రంలో లేనివిధంగా ఇక్కడ ఆశా కార్యకర్తలకు నెలకు రూ.10 వేలు వేతనం కింద చెల్లిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో పరిశీలిస్తే.. ఉత్తరప్రదేశ్‌లో రూ.750, హిమాచల్‌ప్రదేశ్‌లో రూ.2,000, రాజస్థాన్‌లో రూ.2,700, పశ్చిమ బెంగాల్, దిల్లీల్లో రూ.3,000, హరియాణా, కర్ణాటకల్లో రూ.4,000, కేరళలో రూ.5,000, సిక్కింలో రూ.6,000, తెలంగాణలో రూ.7,500 చొప్పున మాత్రమే ఆశా వర్కర్లకు వేతనం చెల్లిస్తుండడం గమనార్హం. ప్రజల ఆరోగ్యంపై చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలకు ఆ శాఖ మంత్రి సత్యకుమార్ ధన్యవాదాలు తెలిపారు.

# జనం అడుక్కోవడానికి అలవాటుపడ్డారు.. బీజేపీ నేత వివాదాస్పద వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, మార్చి 2 (ప్రభాత ఉదయం):** బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి, మధ్యప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రహ్లాద్ పటేల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రజలు చేయి చాచేందుకు అలవాటు పడిపోయారని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. రాజగఢ్ జిల్లాలో వీరాంగన రాణి అవంతీబాయ్ లోధీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరై ప్రసంగించిన సందర్భంగా ప్రహ్లాద్ పటేల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రభుత్వం నుంచి అడుక్కుని తీసుకునేందుకు ప్రజలు అలవాటుపడ్డారు. నేతలు వచ్చినప్పుడల్లా వారికి గంప నిండుగా అర్జీలు ఇస్తుంటారు. స్టేజీలపైన నేతలకు పూలమాలలు వేసి చేతుల్లో అర్జీలు పెడుతుంటారు. ఇది మంచి అలవాటు కాదు. ఇలా అర్థించే బదులు ఇచ్చే అలవాటును పెంపొందించుకోవాలి. దాంతో సమాజంలో సంస్కారం పెరగడంతోపాటు జీవితం ఆనందమయం అవుతుంది' అన్నారు. చేయిచాచే వారివల్ల సమాజం బలహీనమవుతుందని, ఉచితాలకు ఆకర్షితులు కావడం ధీర మహిళల లక్షణం కాదని పటేల్ చెప్పారు. అమరులను గౌరవించుకోవడం అంటే వారు చూపిన మార్గంలో వారి ఆదర్శాలకు అనుగుణంగా జీవించడమేనని అన్నారు. నిజమైన దేశభక్తులు చేయిచాచి అర్థించినట్టు మనం ఎక్కడైనా విన్నామా..? అని ప్రశ్నించారు. నర్మదా పరిక్రమ యాత్రికుడిగా తాను దానాలు స్వీకరించానని, కానీ అవి నా కోసం కాదని, నాకు ఏదైనా ఇచ్చినట్లు చెప్పే వ్యక్తి ఎవరూ లేరని అన్నారు. ప్రహ్లాద్ పటేల్ వ్యాఖ్యలపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం



వ్యక్తం చేసింది. మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు జీతూ పట్వారీ.. పటేల్ ఖండించారు. ఆయన రాష్ట్ర ప్రజలను అవమానించారని అన్నారు. ప్రజలను భిక్షగాళ్లు అనే స్థాయికి బీజేపీ అహంకారం పెరిగిపోయిందని మండిపడ్డారు. ప్రజల కష్టాలు, ఆశలు, కన్నీళ్లను ఆయన అవమానించారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తే భిక్షగాళ్లంటూ అవమానిస్తారా అని మండిపడ్డారు. త్వరలో బీజేపీ నేతలే ఓట్లు అడుక్కుంటూ వస్తారని, అప్పుడు ప్రజలు గుణపాఠం చెప్పాలని అన్నారు.


బాలికలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న హైదరాబాద్ జిల్లా బాలల రక్షణ అధికారి శ్రీనివాస్

# బాలికలు పట్టుదలతో చదివితే అన్ని రంగాలలోనూ రాణిస్తారు

## హైదరాబాద్ జిల్లా బాలల రక్షణ అధికారి శ్రీనివాస్

చార్మినార్, మార్చి 2(ప్రభాత ఉదయం) బాలికలు పట్టుదలతో చదివితే అన్ని రంగాలలోనూ ఉన్నత శిఖరాలను అధిరోహి స్తారని హైదరాబాద్ జిల్లా బాలల రక్షణ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పాతబస్తీ దూద్ బౌలి లోని ఆశ్రిత హోంలో జరిగిన సి బిసిపి అవేర్ నెస్ కార్యక్రక్రమం లో ఆయన పాల్గొని పలు బస్తీలకు చెందిన నిరు పేద లకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాలికలు పట్టుదలతో చదువు కోవాలని తెలిపారు. కార్యక్రమం లో ఆశ్రిత హెూం డైకెక్టర్ నాగరాజ్.పి ఓసీలు విజయ్ భాస్కర్.రాంరెడ్డి.ప్రోగ్రాం మేనే జర్ పర్వతాలు.అనిత.లక్ష్మిలు పాల్గొన్నారు.


శ్రీ మాతా పోచమ్మ దేవాలయం కమాన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న భక్తులు

# రాజేంద్రనగర్ శ్రీ మాతా పోచమ్మ దేవాలయం కమాన్ నిర్మాణానికి భూమి పూజ

బుద్వేల్ మార్చి2(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ శ్రీ మాతా పోచమ్మ దేవాలయం కు ఎన్ఐఆర్డీపీఆర్ మార్గంలో కమాన్ నిర్మించడానికి దేవాలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం భూమి పూజ చేశారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు దుంబాల ఉమారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొమిరె గణేశ్ ల ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. దేవాలయ పూజారి రంగనాయకులు వేధ మంత్రోచ్చరణల మధ్య ఈ భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించారు.ప్రతి సంవత్సరం బోనాల ఉత్సవాలు అమ్మవారి దేవాలయం లో ఘనంగా నిర్వహించడం జరుగుతుం దన్నారు. అంతేకాకుండ ప్రతి రోజు దేవాలయంలో ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహిం చడం జరుగుతుందన్నారు. కమాన్ నిర్మాణానికి భక్తులు సహకరించాలన్నారు. భూమి పూజలలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ వైశ్రీదర్, కిరోసిన్ రాజు, పీర్లగూడెం జంగయ్య, పీవీ శ్రీనివాస్, పి.శివరాం, డి.బాల్ రాజ్, జి. రాకేశ్. వేముల రమేశ్, కె.శంకర్, శ్రీకాంత్, కె. శ్రీను, మహేశ్, వెంకటేశ్ మేస్త్రీ, సతీష్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# నూతన వధువు వరులను ఆశీర్వదించిన నాయకులు

కొత్తకోట, మార్చి2(ప్రభాత ఉదయం) హైదరాబాద్ మన్నెగూడ వేద కన్వెన్షన్ సెంటర్ లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి , నీరజ కూతురు నవ్య వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వివాహ వేడుకల్లో కొత్తకోట మండల బి ఆర్ ఎస్ నాయకులు మూలమల్ల యుగంధర్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# అద్దె చెల్లించకపోవడంతో.. ఆప్ కార్యాలయానికి లాక్




భోపాల్, మార్చి 2 (ప్రభాత ఉదయం): ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కార్యాలయానికి కొన్ని నెలలుగా అద్దె చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కార్యాలయానికి ఇంటి యజమాని తాళం వేశాడు. అయితే తమ నిజాయితీకి ఇది నిదర్శమని ఆప్ తెలిపింది. నిధులు లేకపోవడంతో అద్దె చెల్లించలేదని పేర్కొంది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ఆప్ కార్యాలయానికి మూడు నెలలుగా అద్దె చెల్లించలేదు. ఈ నేపథ్యంలో అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న ఆ పార్టీ కార్యాలయానికి ఇంటి యజమాని తాళం వేశాడు. కాగా, మధ్యప్రదేశ్ ఆప్ జాయింట్ సెక్రటరీ రమాకాంత్ పటేల్ దీనిపై స్పందించారు. స్థానిక నిధులతో పార్టీ వ్యవహారాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ పార్టీ కార్యకర్తల ఆర్థిక పరిస్థితి బాగోలేదని ఆయన అన్నారు. ఆఫీస్ అద్దె మొత్తం ఎంత, ఎన్ని నెలలు చెల్లించాలో అన్న వివరాలు తనకు తెలియవని చెప్పారు. 'మేం నిజాయితీగా పనిచేసినప్పుడే ఇలా జరుగుతుంది. ప్రస్తుతం మా పార్టీ వద్ద నిధులు లేవు. కాబట్టి మేం అద్దె చెల్లించలేకపోయాం. మేం నిజాయితీపరులం. పరిస్థితులు మెరుగుపడతాయి' అని అన్నారు. మరోవైపు మధ్యప్రదేశ్ బీజేపీ ప్రతినిధి నరేంద్ర సలుజా దీనిపై స్పందించారు. 'ఎంపీలోని ఆప్ కార్యాలయానికి లాక్ పడింది. ఆ తర్వాత కాంగ్రెస్‌దే' అని ఎక్స్‌లో విమర్శించారు. కాగా, అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయింది. కేవలం 22 సీట్లకే పరిమితమైంది. మొత్తం70 స్థానాలకుగాను 48 సీట్లు గెలుచుకున్న బీజేపీ ఢిల్లీలో అధికారంలోకి వచ్చింది

